## క్లుప్తంగా

### ముగిసిన క్రీడా పోటీలు



షాట్‌పుట్ పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

కదిరి అర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గత మూడు రోజులుగా జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, షటిల్, యోగా పోటీల్లో బాలికలు 95 మంది, బాలురలో 150 మంది క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటాచలం, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఘనంగా గురజాడ జయంతి

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం గురజాడ అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ.. కన్యాశుల్కం నాటకంతో గురజాడ సమాజానికి కనువిప్పు కలిగించారని చెప్పారు. దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అని ఎలుగెత్తి చాటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.స్మిత, వైస్ ప్రిన్సిపాల్ శివప్రసాద్‌తో పాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

### పౌష్టికాహారంతో ఆరోగ్యం



పౌష్టికాహారాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం

తనకల్లు: పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి అన్నారు. గేమేనాయక్ తండా అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు.

### ఇసుక రీచ్ ప్రారంభం

తాడిమర్రి: మండలంలోని చిన్నచిగుళ్లరేవులో చిత్రావతి నది వద్ద ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను అధికారులు శనివారం ప్రారంభించారు. భూగర్భ గనులశాఖ ఏడీ రామ్మోహన్‌రావు, డీఎస్పీ శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకంగా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇసుక అందిస్తామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, మీసేవ కేంద్రాలు, నెట్ సెంటర్లలో ఇసుక కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఎస్‌ఐ నాగస్వామి, వీఆర్‌ఓ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

### తహసీల్దార్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు నూతన తహసీల్దార్ నీలకంఠారెడ్డిని ఆ మండల వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఎంపీపీ గాయత్రి, వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, కాపునాడు జిల్లా ఉపాధ్యక్షుడు దాల్‌మిల్ సూరి, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అంగడి సోమశేఖర్ రెడ్డి, వైస్ సర్పంచ్ యుగంధర్, పార్టీ టౌన్ కన్వీనర్ ముద్దల భాస్కర్, నాయకులు రెడ్డెప్పరెడ్డి, వాల్మీకి శంకర్, అలకుంట్ల శ్రీనివాసులు, ఆంజనేయులు, మాధవ, ఇరంగంపల్లి సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### శ్మశాన వాటికలను ఎస్సీలకు కేటాయించాలి

ధర్మవరం అర్బన్: కబ్జాకు గురయిన దళితుల శ్మశాన వాటికను తిరిగి ఎస్సీలకు కేటాయించాలని ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లిలో ఎస్సీ మాల సామాజిక వర్గాల శ్మశాన వాటికను అదే గ్రామానికి చెందిన అగ్రకులాల వారు ఆక్రమించారన్నారు. అనంతరం కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందించారు.

### రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ధర్మవరం రూరల్: అనంతపురంలో ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లా ఎంపిక పోటీల్లో చిగిచెర్ల విద్యార్థులు ప్రతిభ చాటారు. యశ్వంత్ 35 కేజీల విభాగంలో విక్రాంత్ , 40 కేజీల విభాగంలో అఫ్జల్ మెహరాజ్, 50 కేజీల విభాగంలో కావ్యశ్రీ, 44 కేజీల పైబడిన విభాగంలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు పీడీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 22 నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు తిరుపతిలో జరగనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు తిమ్మారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

---



ధర్మవరం అంటే చేనేత.. చేనేత అంటే ధర్మవరం. చేనేతల మనసు దోచుకుంటే ఎన్నికల్లో ఆ అభ్యర్థి విజయం తథ్యం. దీన్ని అవకాశంగా తీసుకున్నారు కూటమి అభ్యర్థి సత్యకుమార్. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని ఆ వర్గానికి హామీలు గుప్పించారు. చేనేతలు కూడా ఆయన మాటలను నమ్మారు. ఓట్ల రూపంలో ఆయనకు పూర్తి మద్దతు ప్రకటించారు. ఇంకేముంది ఆయన గెలిచారు. అయితే తాను ఇచ్చిన హామీలు మరిచారు.. ఫలితంగా చేనేతల కష్టాలు కొనసాగుతున్నాయి. కార్మికుల ఆత్మహత్యల పరంపరకు అడ్డుకట్ట పడటం లేదు. ఇక రైతులకు ఇచ్చిన హామీల అమలు సంగతి సరేసరి.



ధర్మవరం ఏరియల్ వ్యూ

# హామీలు ఘనం.. ఆచరణ శూన్యం!

- ఎన్నికల్లో పలు హామీలు గుప్పించిన మంత్రి సత్యకుమార్
- ధర్మవరంలో మెగా హ్యాండ్‌లూమ్ చేనేత క్లస్టర్ ఏర్పాటు చేయిస్తానని హామీ
- ధర్మవరంలో బైపాస్ రోడ్డు నిర్మాణం, మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయిస్తానని ప్రకటన
- ప్రభుత్వం ఏర్పడి 100 రోజులైనా ఒక్కటీ నెరవేర్చని వైనం

ధర్మవరం: ఎన్నికలకు ముందు కూటమి అభ్యర్థి, ప్రస్తుత మంత్రి సత్యకుమార్ యాదవ్ ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు లోకల్ అజెండాతో తొమ్మిది పేజీలతో వందకు పైగా హామీలు ఇచ్చారు. ఎన్నికల్లో గెలవగానే తాను ఇచ్చిన ప్రతిహామీని అమలు చేసి తీరుతానని ఏకంగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను ధర్మవరానికి రప్పించి మరీ ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చి వందరోజులు దాటినప్పటికీ వాటి అమలుకు కనీస చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. నియోజకవర్గంలోని లక్షలాది మంది సదరు నేత ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలవుతాయా అని ఎదురుచూస్తున్నారు. ఆచరణ సాధ్యమా కాదా అన్నది లేకుండా ఇబ్బడి ముబ్బడిగా హామీలు గుప్పించడం ఆపై బుట్టదాఖలు చేయడం పరిపాటిగా మారుతోందన్న విమర్శలు నియోజకవర్గ ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి.

### ఎన్నికల హామీలు అమలు చేయాలి



ప్రజా ప్రతినిధులు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేయాల్సిన బాధ్యత ఎంతైన ఉంది. యాధావిధిగా ఇబ్బడి ముబ్బడి హామీలు ఇవ్వడం అధికారంలోకి వచ్చా విస్మరిస్తే ప్రజాక్షేత్రంలో మన్నన పొందలేరు. ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు కూటమి అభ్యర్థి ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

– చందమూరి నారాయణరెడ్డి, కౌన్సిలర్, ధర్మవరం

### తీవ్ర ఇబ్బందుల్లో చేనేతలు



వేలాదిమందికి ఉపాధినిచ్చిన చేనేత వ్యవస్థ దుర్భర స్థితిలో ఉంది. కార్మికులకు కనీస వేతనం లేక నేసిన చీరలకు గిట్టుబాటు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా చేనేతలకు ఉపాధి కల్పించే ఫ్యాక్టరీలు తెస్తామని, ముడిపట్టు రాయితీ ఇస్తామని, నేతన్న నేస్తం కింద రూ.24 వేలు సాయం ఇస్తామని చెప్పారు. కానీ ఇప్పటి వరకు ఒక్క పథకం అమలు కాలేదు. ఆ ప్రయత్నమూ జరగలేదు. – జింకా కంబగిరి, వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు, ధర్మవరం

### ఎన్నికల్లో సత్యకుమార్ ఇచ్చిన ప్రధాన హామీలు

- ✔ ధర్మవరంలో మెగా చేనేత క్లస్టర్, గార్మెంట్ ఫ్యాక్టరిని ఏర్పాటు చేసి వేల మంది చేనేత కార్మికులకు, మహిళలకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు.
- ✔ చేనేత కార్మికులకు ప్రతి యేడాది రూ.24వేలు ఆర్థిక సాయం, ఉచిత మగ్గంషెడ్ నిర్మాణం, చేనేతలకు కల్యాణ మండపం నిర్మాణం
- ✔ మరమగ్గాల దీటుగా చేనేత మగ్గాలను ఆదరణ పథకం కింద రాయితీతో పనిముట్లు మంజూరు.
- ✔ నేషనల్ హ్యాండలూమ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ద్వారా ముడిపట్టు రాయితీ అందజేత.
- ✔ ధర్మవరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు
- ✔ ధర్మవరంలో టెక్స్‌టైల్స్ టూరిజం ఏర్పాటు
- ✔ నియోజకవర్గంలో మెడికల్ కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీలతో పాటు మహిళా డిగ్రీ కాలేజీ, ప్రతి మండలంలో ప్రభుత్వ బాలికల జూనియర్‌కాలేజీల ఏర్పాటు.
- ✔ ధర్మవరంలో బైపాస్ రోడ్డు, ట్రాఫిక్స్ సిగ్నలింగ్ వ్యవస్థ నిర్మాణం
- ✔ నియోజకవర్గంలో ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు, ప్రభుత్వ ఆసుపత్రిలో వంద పడకలు, ముదిగుబ్బలో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు
- ✔ హంద్రీనీవా కాలువలతో చెరువుల అనుసంధానం, ధర్మవరం చెరువుకు పూర్తిస్థాయిలో నీరందించేలా చర్యలు
- ✔ సీబీఆర్ నుంచి ముదిగుబ్బ, తాడిమర్రి మండలాలకు సాగు, తాగునీరు
- ✔ తాడిమర్రి మండలంలో ప్రధాన రహదారి నిర్వాసితులకు, మర్రిమాకుల పల్లి ఎస్సీ కాలనీలలో చిత్రావతి ముంపు బాధితులకు సత్వర పరిహారం అందజేత.



ఎన్నికల సందర్భంగా ధర్మవరంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న సత్యకుమార్(ఫైల్)

పై హామీలతో పాటు వందకు పైగా హామీలను మంత్రి సత్యకుమార్ లోకల్ మేనిఫెస్టోగా ప్రకటించి విస్తృతంగా ప్రచారం చేశారు.

### నిత్యం ట్రాఫిక్ కష్టాలు..

తనను గెలిపిస్తే ధర్మవరం చుట్టూ రింగ్‌రోడ్డు(బైపాస్) నిర్మిస్తానని సత్యకుమార్ హామీ ఇచ్చారు. అంతేకాదు పట్టణంలో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యకు చెక్ పెడతానని ప్రకటించారు. అయితే దీనిపై మంత్రి ఏ రోజూ దృష్టి సారించలేదు. ధర్మవరంలో ట్రాఫిక్ సమస్య నిత్యకృత్యంగా మారింది. కాలేజీ సర్కిల్, పీఆర్టీ సర్కిల్, గాంధీసర్కిళ్ల వద్ద ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. వాహనాల సంఖ్య పెరగడం, రహదారులు ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఇప్పటికైనా మంత్రి ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తారేమోనని పట్టణవాసులు ఎదురుచూస్తున్నారు.



పీఆర్‌టీ సర్కిల్‌లో ట్రాఫిక్ ఇలా..

### చేనేతలకు మొండిచేయి

ఎన్నికల్లో గెలిస్తే చేనేతకు పూర్వవైభవం తీసుకొస్తానని సత్యకుమార్ ప్రకటించారు. ధర్మవరంలో మెగా చేనేత క్లస్టర్, గార్మెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి వేల మంది చేనేత కార్మికులకు, మహిళలకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే చేనేత కార్మికులకు ఏటా రూ.24 వేలు ఆర్థిక సాయం ఇవ్వడంతోపాటు ఉచిత మగ్గంషెడ్ నిర్మించి ఇస్తామని ప్రకటించారు. దీంతో ధర్మవరంలో చేనేతలు ఎక్కువగా ఉన్నందున ప్రత్యేకంగా కల్యాణ మండపం నిర్మిస్తామని చెప్పారు. మరమగ్గాల దీటుగా చేనేత మగ్గాలను ఆదరణ పథకం కింద రాయితీతో పనిముట్ల మంజూరు చేస్తామన్నారు. నేషనల్ హ్యాండలూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రాయితీతో ముడిపట్టు అందజేస్తామని ప్రకటించారు. మెరుగైన మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని గొప్పగా చెప్పారు. అయితే ఈ హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదు. వంద రోజుల పాలనలో ఒక్కరోజూ వీటి అమలుపై కనీసం మాటమాత్రమైనా ప్రస్తావించలేదంటే మంత్రికి తాను ఇచ్చిన హామీలపై ఎలాంటి నిబద్ధత ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ప్రత్యక్షంగా పరోక్షంగా దాదాపు 50 వేల మందికిపైగా కార్మికులు చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోవడంతో కార్మికులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. ఈక్రమంలో నేత కార్మికులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా మంత్రి తన హామీల ఆచరణకు నడుం బిగించడం లేదు.



---

## శాంతి భద్రతల విషయంలో రాజీవద్దు

ఎన్పీకుంట: శాంతి భద్రతల విషయంలో రాజీ పడొద్దని కదిరి డీఎస్పీ శివనారాయణ స్వామి పోలీస్ సిబ్బందికి సూచించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను కదిరి రూరల్ సీఐ నాగేంద్రతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో క్రైమ్ రేట్‌పై ఆరా తీశారు. ప్రమాదాల నివారణ, శాంతిభద్రతల విషయంపై పలు సూచనలు చేశారు. కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. మండలంలో అక్రమ మద్యం, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని తెలిపారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో సఖ్యతగా మెలగాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలపై ఆరా తీశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీధర్, జమేదార్లు ఆజాద్, ఓబులేశు, సిబ్బంది అమల, ప్రభాకర్, హోంగార్డు రాజు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శివనారాయణ

### సన్మానం..

కదిరి టౌన్: బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా నాగరాజు ఆధ్వర్యంలో శనివారం బీసీ ఉద్యోగస్తులు నూతన డీఎస్పీ శివనారాయణ స్వామిని కలిశారు. దుశ్శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ఆదినారాయణ, భాస్కర్, రామ్మోహన్, హరి, జయరాజ్, మునిస్వామి, రామాంజనేయులు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుందాం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట



ఆర్టీసీ బస్టాండ్‌లో పెయింటింగ్ వేస్తున్న డీపీటీఓ మధుసూదన్

పుట్టపర్తి టౌన్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుందామని జిల్లా రవాణాధికారి ( డీపీటీఓ) మధుసూదన్ సూచించారు. శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆర్‌ఎం కార్యాలయ ఆవరణ, బస్టాండ్ ప్రాంతంలో సిబ్బందితో కలసి ఆయన శుభ్రం చేశారు. మరుగొడ్లు శుభ్రం చేసి బల్లలకు రంగులు వేశారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉల్లాసంగా ఉంటారన్నారు. డిపో మేనేజర్ ఇనయతుల్లా, ఎస్టీఐ పెద్దన్న పాల్గొన్నారు.

### ప్రభుత్వ కార్యాలయాలు శుభ్రం

పుట్టపర్తి అర్బన్: స్వచ్ఛతా హీ సేవలో భాగంగా శనివారం ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రం చేశారు. పుట్టపర్తిలోని ఎంపీడీఓ కార్యాలయం, వ్యవసాయ కార్యాలయం, పోలీస్ స్టేషన్, ఉద్యానశాఖ కార్యాలయం, హౌసింగ్ కార్యాలయం తదితర కార్యాలయాలను అధికారులు, సిబ్బంది చీపుర్లు చేతపట్టి శుభ్రం చేశారు.

### పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి

కదిరి టౌన్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కోర్టు రోడ్డు మీదుగా నిజాంవలీ విగ్రహం, ఇందిరా గాంధీ సర్కిల్ మీదుగా వలీసాబ్ రోడ్డు, రాయలసీమ, టవర్‌క్లాక్ మీదుగా ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



సంజీవపురంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

### 'స్వచ్ఛత' దిశగా అడుగులు వేయాలి

బత్తలపల్లి: మండల ప్రజలు ప్రతి ఒక్కరూ స్వచ్ఛత దిశగా అడుగులు వేయాలని ఎంపీడీఓ సాయిమనోహర్ పిలుపునిచ్చారు. శనివారం స్వచ్ఛతా హీ సేవ–2024 కార్యక్రమంలో భాగంగా మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు, స్థానికులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించి, స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ దివాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మీలతో పాటు వైద్య ఆరోగ్య సిబ్బంది, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

### విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి



మెప్మా స్టాల్‌ను ప్రారంభిస్తున్న సింధూరారెడ్డి, రఘునాథరెడ్డి

పుట్టపర్తి టౌన్: విద్యార్థులు కష్టపడి చదివి, ఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసురావాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి సూచించారు. శనివారం పుట్టపర్తి పట్టణంలో ఉన్న బాలుర వసతి గృహాన్ని ఆమె పరిశీలించి, అక్కడ ఉన్న సమపస్యలను విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం అన్నా క్యాంటీన్‌లో భోజన నాణ్యతను పరిశీలించారు. అలాగే మున్సిపల్ కార్యాయలం వద్ద ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ స్టాల్స్‌ను మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలసి ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, సిబ్బంది పాల్గొన్నారు.

### ఏపీయూస్ మండల శాఖ ఎన్నిక

ఓడీచెరువు: మండల కేంద్రంలో శనివారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) మండల శాఖను ఏర్పాటు చేసి, అధ్యక్షుడిగా శ్రీరామనాయక్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ ఎన్నికలను పర్యవేక్షించారు. ఎంఈఓ సురేష్, ఎమ్మార్సీ సిబ్బంది, ఉపాధ్యాయులు ఎన్నికైన వారిని అభినందించారు.

### 27న కృతజ్ఞతా యాత్ర

పుట్టపర్తి టౌన్: అనంతపురంలో ఈ నెల 27న నిర్వహించే కృతజ్ఞతా యాత్రకు జిల్లా వ్యాప్తంగా మాదిగలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఏపీ ఎమ్మార్పీస్ రాష్ట్ర కార్యదర్శి పేరుపోగు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం పుట్టపర్తి పట్టణంలో సాయి ఆరామంలో కృతజ్ఞత యాత్రకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. నాయకులు తిప్పయ్య, పెనుకొండ నరశింహులు,నాగరాజు, శీనప్ప, నరశింహులు, గణేష్ , రామాంజి, బాబయ్య తదితరులు పాల్గొన్నారు

### మట్టిరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

గాండ్లపెంట: మండల పరిధిలోని గొడ్డువెలగల పంచాయితీ వీరన్నగట్టుపల్లి నుంచి నీరుకుంట్లపల్లి గ్రామం వరకూ చేపట్టనున్న మట్టిరోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శనివారం భూమిపూజ చేశారు. రూ.50 లక్షలతో 1.5 కిలోమీటర్ల మట్టి రోడ్డు నిర్మిస్తామని పేర్కొన్నారు.

## సంక్షిప్త సమాచారం

### చికిత్స పొందుతూ యువకుడి మృతి

కనగానపల్లి: మండలంలోని కుర్లపల్లి తండాలో వినాయక నిమజ్జనం సందర్భంగా ప్రమాదవశాత్తూ గాయపడిన యువకుడు సాయికిరణ్(19) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

### పోలీస్ స్టేషన్ తనిఖీ

గాండ్లపెంట: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శనివారం కదిరి డిఎస్పీ శివనారాయణ స్వామి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో పలు కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రూరల్ సీఐ నాగేంద్ర, ఎస్‌ఐ క్రిష్ణవేణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### రేపటిలోపు ఈ–కేవైసీ పూర్తి చేయాలి

అమడగూరు: రైతుల ఈ–కేవైసీ సోమవారం లోపు పూర్తి చేయాలని వ్యవసాయాధికారి వెంకటరమణాచారి సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతుల పొలాల్లో ఈ క్రాప్ బుకింగ్ చేశామన్నారు.

### ఇసుక అక్రమ రవాణాపై కొరడా

బత్తలపల్లి: మండలంలోని చిత్రావతి నది నుంచి రోజూ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండడంతో పోలీసులు అక్రమార్కులపై కొరడా ఝులిపిస్తున్నారు. శనివారం వాహనాలను తనిఖీ చేస్తుండగా రామాపురం వద్ద రెండు ఇసుక టిప్పర్‌లు, ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని, వాటిని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

### అతిథి అధ్యాపకుడి పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

ముదిగుబ్బ: ముదిగుబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అర్థశాస్త్రం అధ్యాపకుడి పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రామరాజు తెలిపారు. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో కనీసం 50 శాతం మార్కులు సాధించిన వారు ఈ నెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 26న ఇంటర్వ్యూ ఉంటుందన్నారు.

### ఘనంగా ఫ్రెషర్స్ డే

పుట్టపర్తి: బుక్కపట్నంలోని శ్రీ సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులు ఫ్రెషర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది శ్రీనివాసులు, వెంకటేశ్వరప్రసాద్, ఓబయ్య, దస్తగిరి, ఓబులేసు, గంగారాజు, ఆనంద్, సాగేంద్ర, రామాంజినేయులు, శంకర తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాడిమర్రి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆమె మండలంలోని పంచాయతీల్లో అధికారులతో కలిసి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా గ్రామాల్లో స్వచ్ఛతాకీ భాగీరథీ, సంపూర్ణ స్వచ్ఛత, సఫాయి మిత్ర శివారీ, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు సేఫ్టీ కిట్లు, టూల్స్, మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు, విద్యార్థులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలి

బత్తలపల్లి: గ్రామాల్లో ప్రశాంత జీవనం సాగించాలని ఎస్‌ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం రాత్రి అనంతసాగరం, ఎం.చెర్లోపల్లి గ్రామాల్లో తమ సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ప్రతి ఒక్కరూ తప్పకుండా ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. రౌడీ షీటర్లుకు, గత కేసుల్లో నిందితులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

### ఈ పంట నమోదు చేయించుకోండి

ధర్మవరం రూరల్: ఈ పంట నమోదును తప్పక చేయించుకోవాలని ఏడీఏ కృష్ణయ్య రైతులకు తెలియజేశారు. శనివారం వ్యవసాయాధికారి ముస్తఫాతో కలిసి కునుతూరు, పోతుకుంట గ్రామాల్లో ఈకేవైసీ ప్రక్రియను పరిశీలించారు. ఈ నెల 23లోపు ఈ పంట నమోదుతో పాటు ఈకేవైసీని తప్పక చేయించాలని వ్యవసాయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కర్ణాకర్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

### పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

ధర్మవరం అర్బన్: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని బీజేపీ జాతీయ నాయకులు అంబటి సతీష్ కుమార్, మున్సిపల్ మెప్మా టీపీఓ విజయ్‌భాస్కర్ తెలిపారు. శనివారం పట్టణంలో మెప్మా ఆర్‌పీలు, మున్సిపల్ సిబ్బందితో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు.

## పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలి

ప్రశాంతి నిలయం: సత్యసాయి ట్రస్ట్ ద్వారా అందిస్తున్న పనిముట్లను సద్వినియోగం చేసుకుని భక్తులు స్వయం ఉపాధి సాధిస్తూ విలువలతో కూడిన జీవితాన్ని అనుభవించాలని సత్యసాయి సెంట్రల్‌ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు సూచించారు. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన శ్రీకాకుళం జిల్లా సత్యసాయి భక్తులు శనివారం ఉదయం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సామూహిక సత్యసాయి అష్టోత్తర సహస్ర నామావళిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 3,500 మంది భక్తులు ఏకకాలంలో నిర్వహించిన నామావళితో సాయికుల్వంత్ సభా మందిరం మార్మోగింది. అనంతరం ఎంపికైన శ్రీకాకుళం జిల్లా సత్యసాయి భక్తులకు కుట్టుమిషన్లు, ఎలక్ట్రికల్ పనిముట్లు, కార్పెంటర్, ప్లంబింగ్ కిట్లు, ఫ్లోర్‌మిల్‌లను రత్నాకర్ రాజు భక్తులకు కిట్లను అందజేశారు. సాయంత్రం శ్రీకాకుళం జిల్లా సత్యసాయి భక్తులు శ్రీ సత్యసాయి స్వరమాధురి పేరుతో సంగీత కచేరి నిర్వహించారు.



పనిముట్లను పంపిణీ చేస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు